ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఆరుతడి అంతంతమాత్రమే

రబీలో తగ్గిన అపరాల సాగు - సాగర్ ఆయకట్టులో వరికి విముఖత

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



రబీ సీజన్ మరో 15 రోజుల్లో ముగింపు దశకు వస్తున్నా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సాగు 50 శాతానికి మించే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో 40 శాతం, పల్నాడు జిల్లాలో 45 శాతం విస్తీర్ణంలోనే పైర్లు సాగయ్యాయి. గుంటూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేయాల్సి ఉండగా 72 వేల ఆరుతడి పంటలు వేశారు. 600 ఎకరాల్లోనే వరి సాగైంది. పల్నాడు జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా 62 వేల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలను సాగు చేశారు. పల్నాడు జిల్లాలో రబీ సాగుగా 69 వేల వరి సాగు చేస్తారని అంచనా వేయగా కేవలం 10 వేల ఎకరాల్లోనే వరి సాగు చేశారు. జలాశయాల్లో నీరు పుష్కలంగా వున్నా వరి సాగు తగ్గడం గమనార్హం.

కృష్ణా డెల్టా పరిధిలో ఆశించిన స్థాయిలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర కూడా సాగవ్వలేదు. పల్నాడులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కృష్ణా డెల్టా పరిధిలో వరి కోతలు పూర్తయిన వెంటనే జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలను సాగు చేయాల్సి ఉండగా ఈసారి ఈ పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గుంటూరు జిల్లాలో 1.67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా అదే స్థాయిలో ఆరుతడి పంటలు సాగవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 40 శాతం విస్తీర్ణంలోనే సాగయ్యాయి. 55 వేల ఎకరాల్లో జొన్న సాగు చేస్తారని భావించగా 9,500 ఎకరాల్లోనే వేశారు. మొక్కజొన్న 51 వేల ఎకరాలకు గాను కేవలం 38 వేల ఎకరాలు, ముతక ధాన్యాలు లక్ష ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా కేవలం 45 వేల ఎకరాల్లోనే వేశారు. 25 వేల ఎకరాల్లో శనగ పంట వేయాల్సి ఉండగా 18 వేల ఎకరాల్లో, పెసర 26 వేల ఎకరాలకు గాను ఐదు వేల ఎకరాల్లో, మినుము 16 వేల ఎకరాలకు గాను 6 వేల ఎకరాల్లో వేశారు.

పల్నాడు జిల్లాలో జొన్నలు 1500 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా కేవలం 15 ఎకరాల్లోనే వేశారు. మొక్కజొన్న 20 వేల ఎకరాలకు గాను 26 వేలు, ముతక ధాన్యాలు 22 వేల ఎకరాల్లో సాగు చేస్తారని భావించగా 27 వేల ఎకరాలు, శనగ 30 వేల ఎకరాలకు గాను 17,500 ఎకరాలు, పెసర 1500 ఎకరాలకు గాను కేవలం 135 ఎకరాల్లో, మినుము ఐదు వేల ఎకరాలకు గాను 800 ఎకరాల్లో సాగు చేశారు.

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఖరీఫ్‌లో ఏ పంటలు వేయని దాదాపు 1.30 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేసినా ఆశించిన స్థాయిలో రబీ సాగు లేదు. సహజంగా డెల్టాలో కనీసం రెండోపంటగా సాగు చేసే ఆరుతడి పంటలకు సైతం

▶ 2లో



విలేకర్లకు వివరాలు చెబుతున్న పాశం రామారావు

డబ్బుల్లేకే ఇళ్ల నిర్మాణానికి వెనకడుగు

- పెరిగిన వ్యయంతో పూర్తవ్వని గృహాలు
- ప్రభుత్వ సాయం రూ.5 లక్షలివ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- జగనన్న కాలనీల్లో సిపిఎం సర్వే అంశాలు వెల్లడి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడిపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సిపిఎం కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా జగనన్న గృహనిర్మాణాలు, టిడ్కో గృహాలు, సంక్షేమ పథకాల్లో కోత, ఇళ్ల పట్టాలు, మౌలిక వసతులు తదితర సమస్యలపై సర్వే నిర్వహించినట్లు చెప్పారు. సర్వే 15 మండలాలలో 62 గ్రామాలలో, 6 పట్టణాలలో చేశామన్నారు. జిల్లాలో 68,948 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతుండగా ఇళ్ల నిర్మాణం మాత్రం 10 శాతం కూడా పూర్తవ్వలేదన్నారు. మరో 10 శాతం బేస్ మట్టం వరకు పూర్తి చేసుకుని, ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బు చాలక పనులు ఆపేసినట్లు తమ సర్వేలో తేలిందని తెలిపారు. సిమెంట్, ఇసుక, ఇనుము, ఇతర బిల్డింగ్ మెటీరియల్ ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు బేస్ మట్టానికి కూడా చాలడం లేదని చెప్పారు. ఊరికి దగ్గరగా, రోడ్డు వసతి, విద్యుత్, తాగునీరు సౌకర్యాలున్న ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, ఆర్థిక

▶ 2లో

ధర్మాన కమిటీని రద్దు చేయాలి

- అసైన్డ్ భూములను కాజేయడం కోసమే ఈ కమిటీ
- భూమిలేని ప్రతి పేద కుటుంబానికి రెండెకరాలివ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు, పక్కన కె రోశయ్య, ఎ లక్ష్మీశ్వరరెడ్డి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షతన వేసిన అసైన్మెంట్ భూముల పరిశీలన కమిటీని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి బుధవారం వచ్చిన ఆయన మిలేకర్లతో మాట్లాడారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా వేసిన కోనేరు రంగారావు కమిటీ రాష్ట్రంలోని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికీ రెండు ఎకరాలు సాగుభూమి పంచాలని, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములన్నింటినీ తిరిగి పేదలకు స్వాధీన పరచాలని కోరిందని గుర్తు చేశారు. అయితే ఆ దిశగా చర్యలు తీసుకోని ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను కబ్జాదారులకు కట్టబెట్టడం కోసం ఇతర రాష్ట్రాల్లో పరిశీలన చేస్తామంటూ కమిటీ వేయడం పెద్ద కుట్రని అన్నారు. పేదల భూములు కాజేయటానికే ఈ కమిటీ వేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పేదలకు పంచితే దాదాపు 15 లక్షల ఎకరాల వరకు కబ్జాదారులు కాజేసారని, వాటిని రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం ధర్మాన ప్రసాదరావు కమిటీ వేశారని విమర్శించారు. పేదలకే అసైన్డ్ భూములు దక్కేలా, భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికీ రెండెకరాల సాగు భూమి పంచాలనే డిమాండ్‌తో

▶ 2లో

గణతంత్ర దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులతో సమీక్షలో గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి 8 లో

శాశ్వతంగా సబ్‌ప్లాన్ చట్టం

దళిత, గిరిజన, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాలు డిమాండ్ - పల్నాడు జిల్లాలోని తహశీల్దార్లందరికీ వినతులివ్వాలని నిర్ణయం 4 లో



గుంటూరులో మోడల్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కానిస్టేబుల్ మోడల్ పరీక్ష విజయవంతం



అస్వస్థతకు గురైన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే వెకంకట రోశయ్య

20 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత

పొలాల్లో పురుగు మందులు పిచికారి చేస్తుండగా ఘటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన వ్యవసాయ 20 మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరంతా బుధవారం తాడికొండ మండలం కంతేరులో వ్యవసాయ పనులకు వచ్చారు. పొలాల్లో పురుగు మందుల పిచికారి చేస్తుండగా ఆ మందు ప్రభావం

▶ 2లో

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి-నరసరావుపేట



మాట్లాడుతున్న రుద్రరాజు

కాంగ్రెస్ చరిత్రను ఏ జాతీయ పార్టీ అధిగమించలేదని , పూర్వ వైభవం తీసుకు రావడానికి కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం పార్టీ కార్యకలపాలకు సంబంధించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా డిసిసి అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ఈ నెల 26 న చేపట్టబోయే పాదయాత్ర, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై పల్నాడు జిల్లాలోని ఆయా నియోజకవర్గ బాద్యులతో సమీక్షించారు. రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు మస్తాన్ వలీ, ఏఐసిసి కార్యదర్శి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ సిడి మయ్యపను, పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇంచార్జ్‌లు మదనమోహన్ రెడ్డి, విజయ్ కుమార్, థాంతీయ కుమారి, రాధ కృష్ణలు ఉన్నారు.

ఆరుతడి అంతంతమాత్రమే

(మొదటి పేజీ తరువాయి)

రైతులు ఆసక్తి కనబర్చకపోవడం చర్చనీయాంశమైంది. ప్రధానంగా కౌలు రైతులు రెండు పంటలకు కౌలు చేసుకునే వారు మాత్రమే రబీ సాగు చేశారని తెలిసింది. భూ యజమానులు కౌలు చేసేవారు మాత్రం రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగుకు కూడా విముఖత ప్రదర్శించడం వ్యవసాయ నిపుణులను కలవరపరుస్తోంది. ఒకవైపు వర్షాలు తగ్గిపోయి ఎండలు పెరుగుతుండటంతో ఇక రబీ సాగు ఇంతకంటే పెద్దగా పెరగకపోవచ్చునని తెలుస్తోంది. మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, శనగ ధరలు ఆశాజనకంగా లేకపోవడం వల్ల రబీలోనూ పూర్తిస్థాయిలో ఆసక్తి చూపడం లేదు. ఖర్చులు పెరగడం, ఆదాయం తగ్గడంతో రైతులు తీవ్ర నిరాశా వాదంలో ఉన్నట్టు రబీసాగు గణాంకాలే వెల్లడిస్తున్నాయి.

ధర్మాన కమిటీని రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

రానున్న మూడు నెలలు వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమిస్తుందని ప్రకటించారు. అసైన్డ్ భూముల్ని ఎక్కడైనా ప్రభుత్వం సేకరించాల్సి వస్తే భూసేకరణ చట్టం-2013 ప్రకారమే తీసుకోవాలని, యడవల్లిలో మాదిరి కాజేయాలని చూస్తే సహించబోమని స్పష్టం చేశారు. సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 17 డిమాండ్ల సాధన కోసం లక్షలాది మందితో ఏప్రిల్ 5న పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కార్మిక, కర్షక ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఢిల్లీలో ప్రదర్శనకు రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, నాయకులు జె.భగత్, కె.నాగేశ్వరరావు, ఎస్.లూథర్, బి.బాలకోటయ్య, వై.వెంకటేశ్వర్లు, జి.చిన్నప్ప, సిహెచ్.హనుమాయమ్మ, బి.కోటమ్మ, జె.రాజకుమార్, పి.సైదాఖాన్ పాల్గొన్నారు.

20 మంది వ్యవసాయ కూలీలకు అస్వస్థత

(మొదటి పేజీ తరువాయి)

వల్ల వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. అప్పటికే గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తుండగా కొందర్ని వెంటనే అక్కడికి తీసుకెళ్లారు. మరో ఏడుగురు మహిళలను గుంటూరులోని శ్రావణి ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిని 108లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. శ్రావణీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు.

టిడ్కో గృహాల్లో అత్తెసరు సదుపాయాలు

- విద్యుత్ మీటరు, రిజిస్ట్రేషన్‌కూ డబ్బు వసూలు
- రాకపోకలకు రూ.200 ఛార్జీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు సరిగా కల్పించలేదని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 52 ఎకరాల్లో నిర్మించిన గృహ సముదాయాలను నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ స్విచ్ బోర్డులు సరిగా ఏర్పాటు చేయలేదని, పైగా ఉచితమంటూనే విద్యుత్ మీటరుకు రూ.450, రిజిస్ట్రేషన్ కోసం రూ.500 వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతానికి ప్రజా రవాణా సదుపాయం లేకపోవడంతో



పిచ్చిమొక్కల మధ్య అసంపూర్తి నిర్మాణంతో ఉన్న ఆస్పత్రి భవనం

ఆటోల్లో వచ్చి వెళ్లడానికి రూ.200 అవుతోందని స్థానికులు వాపోతున్నారని, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఆటస్థలం వృథాగా పడి ఉందని, ఆస్పత్రి కోసం నిర్మించిన భవనం అసంపూర్తిగాను, చుట్టూ పిచ్చిమొక్కలతో దుర్భేద్యంగా ఉందని అన్నారు. ఈ ప్రాంతమంతా ఇదే పరిస్థితి ఉండడంతో పాములు సంచరిస్తున్నాయని వివరించారు. ఈ ప్రాతం మొత్తానికి ప్రహరీ నిర్మించి పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి పైపులు ఇప్పటికే దెబ్బతిన్నాయని, కొన్నిచోట్ల లీకులు ఏర్పడ్డాయని, ఇవేమీ పట్టించుకోకుండానే ఇళ్లను అన్ని విధాలా సిద్ధం చేసినట్లు స్థానిక మంత్రి విడదల రజిని ప్రచారం చేసుకోవడం విడ్డూరమని అన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరా సరిగా లేదని విషయాన్నయినా గ్రహించాలని కోరారు. పరిశీలనలో నాయకులు ఎం.విల్సన్, కె.రోశయ్య, పి.శ్యామ్‌దాస్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లీకేజీలను పరిశీలిస్తున్న నాయకులు

డబ్బుల్లేకే ఇళ్ల నిర్మాణానికి వెనకడుగు

(మొదటి పేజీ తరువాయి)

వెసులుబాటున్న సామాజిక తరగతుల వారు నిర్మాణాలు చేసుకుంటున్నారని, దళితులు, గిరిజనలు, ఇతర పేదలు అసలు ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేని దుస్థితిలో ఉన్నారని వివరించారు. ఊరికి దూరంగా వున్న జగనన్న లే అవుట్‌ల్లో ఒక్క ఇంటి నిర్మాణమూ ప్రారంభం కాలేదని, పెదనందిపాడు మండలంలో ఒక్క ఇల్లు కూడా ప్రారంభించలేదని అన్నారు. తాడికొండ మండలం బడేపురంలో కొండ పక్కన 720 మందికి స్థలాలిచ్చినా మౌలిక వసతుల్లేక ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదన్నారు.

మంగళగిరి నియోజకవర్గంలోని మంగళగిరి టౌన్, రూరల్, తాడేపల్లి టౌన్, రూరల్, పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండలాల్లో ఇళ్ల స్థలాలు లేని లబ్ధిదారులను గుర్తించి, రాజధానిలో స్థలాలు ఇస్తామని హామీ పత్రాలు మంజూరు చేసినా ఇప్పటికీ స్థలాలివ్వలేదని తెలిపారు. జగనన్న ఇళ్ల నిర్మాణం జిల్లాలో 22,613 మందికి కాంట్రాక్టర్ ద్వారా ఇళ్ళ నిర్మాణం చేయాలనే నిర్ణయంలో భాగంగా పేరేచర్ల లేఅవుట్‌లో నాసిరకంగా నిర్మాణం జరుగుతోందని, పిల్లలర్లు లేకుండా ఇల్లు కడితే బలహీనంగా ఉంటాయని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో సుమారు 10 వేల మంది 50 ఏళ్లుగా ఇళ్లుసుకుని ఉంటున్నా వాటికి పట్టాలు మంజూరు చేయలేదని, తాడేపల్లి పట్టణంలో రైల్వే స్థలాల్లో 40 ఏళ్లుగా ఉంటున్న పేదలకు పట్టాలివ్వాలని దీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. పుష్కరాల సందర్భంగా రోడ్డు విస్తరణ పేరుతో తాడేపల్లి పట్టణంలో తొలిగించిన 400 కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలాలు నేటికీ ఇవ్వలేదని తెలిపారు. అటవీ భూముల్లో దీర్ఘకాలంగా ఇళ్లేసుకుని జీవిస్తున్న 3 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలో ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

శిథిలావస్థలో టిడ్కో గృహాలు

గుంటూరు, తెనాలి, మంగళగిరి, పొన్నూరు, రాజధాని గ్రామాల్లో 18,448 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యి శిథిలావస్థకు చేరుకుంటున్నా లబ్ధిదారులకు అప్పగించలేదని రామారావు విమర్శించారు. నాలుగేళ్ల క్రితమే డబుల్ బెడ్ రూం ఇంటికి రూ.లక్ష, సింగిల్ బెడ్ రూం ఇంటికి రూ.50 వేలు చొప్పున లబ్ధిదార్లు డిపాజిట్లు చెల్లించారని గుర్తు చేశారు. సిఆర్‌డిఎ పరిధిలోనే 8 చోట్ల 5024 గృహాలు పూర్తిచేసి ఇంత వరకు లబ్ధిదారులకు ఇవ్వలేదని మరోవైపు బ్యాంకులు మాత్రం వడ్డీ చెల్లించాలంటూ నోటీసులు జారీ చేస్తున్నాయని తెలిపారు.

పింఛన్లలో కొత తగదు

పలు రకాల సాకులతో సామాజిక పింఛన్లలో కోత విధిస్తూ 10 వేల మందికి నోటీసులు జారీ చేశారని, 15 రోజుల్లో సమాధానం ఇవ్వకుంటే పింఛను రద్దు చేస్తామంటూ నోటీసుల్లో ఉందని తెలిపారు. 300 యూనిట్లకు పైగా కరెంట్ బిల్లు, 1050 అడుగుల్లో ఇంటి నిర్మాణం వంటి కారణాలు చూపి పింఛన్లు రద్దు చేసే యత్నాలు సరికాదన్నారు. వీటితోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ సర్వే బృందాల దృష్టికి వచ్చాయని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నగర కార్యదర్శి కె.నళీనికాంత్, నాయకులు బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



క్రిటికల్ కేర్ విభాగంపై అవగాహన

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం చిన కాకాని ఎన్‌ఆర్‌ఐ వైద్యశాల క్రిటికల్ కేర్ విభాగం హెచ్‌ఒడి డాక్టర్ షేక్ ఆరిఫ్ బాషా ఆధ్వర్యంలో బుధవారం వైద్యశాలలో జాతీయస్థాయి సంగ్రహ 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వైద్యరంగంలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ కేర్ విభాగం అత్యంత ప్రతిష్టాత్మకమైనదని అన్నారు. వైద్య విద్యార్థులకు పలు విభాగాల పట్ల అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ఎన్నారై యాజమాన్యానికి హెచ్‌ఒడి ధన్యవాదాలు తెలిపారు. జాతీయ స్థాయిలో పలువురు ఫ్యాకల్టీ వైద్యులు హాజరు కాగా డాక్టర్ ఎ హెచ్ చౌదరి, డాక్టర్ మురళి వెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ సుహాసిని, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు డాక్టర్ ఈశ్వర్ డాక్టర్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

22న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు లక్కరాజు సాయి బుధవారం చెప్పారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ సినీ వినీలాకాశంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్ సూర్యచంద్రుల వంటి వారని, వారి వర్ధంతిలను పురస్కరించుకుని సూర్యచంద్రులు పేరిట స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సాయంత్రం ఐదు గంటలకు సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ గాయకులు పాల్గొంటారని, పంగీత ప్రియులు, ఎన్టీఆర్, ఏఎన్ఆర్ అభిమానులు పాల్గొనాల్సిందిగా కోరారు. సమావేశంలో స్వరలయ వేదిక బృందం పాల్గొన్నారు.



పోలీస్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరిలోని ఆరవ పటాలంలో పోలీస్ కేలండర్, డైరీల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం కమాండెంట్ కార్యాలయంలో జరిగింది. పటాలం కమాండెంట్ కెఎస్-ఎస్ వి. సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వారి 2023వ సంవత్సరం పోలీస్ కేలండరును, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరవ పటాలం అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్, పోలీస్ అసోసియేషన్ సభ్యులు ఆర్ఐ గణపతి, రాములు, ప్రెసిడెంట్ కర్రైన కిరణ్ సిహెచ్ వి శేఖర్, కె ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సమన్వయంతో కృషి

ప్రజాశక్తి -మంగళగిరి: మంగళగిరి కోర్డు పరిధిలో కాంపౌండ్ బుల్ పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్ బిజీ పార్థసారథి అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో జరిగిన స్థానిక న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. నేషనల్ లోకదాలత్ కేసుల పరిష్కరించాలని ఎక్కువ కేసులను ఐడెంటిఫై చేసి పరిష్కరించాలని కోరారు. డి ఎల్ ఎస్ బి కార్యదర్శి రత్నకుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11వ తేదీ లోపు కేసులన్నీ పరిష్కరించాలని కోరారు. సమావేశంలో స్థానిక న్యాయమూర్తులు డి శేషయ్య, ఎస్ వాసుదేవ్, వి ప్రత్యుషలు పాల్గొన్నారు.

భూ- రీసర్వే పై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్:భూమి రి సర్వేలో రైతులకు గ్రామ సభలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివ శంకర్ పేర్కొన్నారు. మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో భూమి రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుండి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి సర్వే సందర్భంగా ఎటువంటి అపోహలు లేకుండా అనుమానాలు నివృత్తి చేసేలా అవగాహన కల్పించాలని కోరారు. అదేవిధంగా ఆత్మకూరు కార్పొరేషన్‌లో విలీనంకాక రెవెన్యూ కార్పొరేషన్ అధికారులు ఎవరు సర్వే చేయాలనే మీమాంస కూడా అధికారులు నెలకొని ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటివి తొలగించి రైతులు అవగాహన కల్పించాలన్నారు.

కెఎల్‌యు పరిశోధకునికి అంతర్జాతీయ విధులు

అంతర్జాతీయ న్యూరో కెమిస్ట్రీ సంస్థకు భారత రాయబారిగా డాక్టర్ షేక్ చాంద్ బాషా



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయంలోని బయో టెక్నాలజీ విభాగంలో పరిశోధకు నిగా విధులు నిర్వహిస్తున్న పోస్ట్ డాక్టోరల్ ఫెలో డాక్టర్ షేక్ చాంద్ బాషాకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా న్యూరో కెమిస్ట్రీ మీద పరిశోధన చేసే అంతర్జాతీయ సంస్థకు భారత రాయబారిగా చాంద్ బాషా ఎంపికైనట్లు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకోగా భారతదేశంలోని చాంద్ భాషను ఎంపికచేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ న్యూరో కెమిస్ట్రీ పరిశోధన సొసైటీ (ఐఎస్.ఎన్.) ప్రధాన కార్యాలయం స్విట్జర్‌ల్యాండులో ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా న్యూరో కెమిస్ట్రీ మీద ఈ సంస్థ పరిశోధనలు చేస్తుందన్నారు. గత నెలలో అమెరికాలో జరిగిన సదస్సుకు చాంద్ బాషాను ఐ.ఎస్.ఎన్ ఆహ్వానించగా ఆ సదస్సులో న్యూరో కెమిస్ట్రీ మీద తాను చేసిన పరిశోధనలను ప్రదర్శించారన్నారు. చాంద్ బాషా కృషిని గుర్తించిన అంతర్జాతీయ న్యూరో కెమిస్ట్రీ పరిశోధన సొసైటీ, యంగ్ స్కాలర్స్ స్టీరింగ్ కమిటీకు భారత రాయబారిగా ఎన్నిక చేసిందన్నారు. మానవ మెదడులో జరిగే రసాయనిక చర్యల మీద ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో మానవ మతిమరుపునకు శాస్త్రీయ కారణాన్ని కనుగొన్న చాంద్ బాషాను ప్రపంచ న్యూరో సైన్స్ పరిశోధనా సంస్థతో కలిసి మరిన్ని పరిశోధనలు చేయాడానికి వారు మరిన్ని అవకాశాలను కలిగించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చాంద్ బాషాను విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ అభినందించారు.

ఎపిజిఇఎ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీ కం హ్యాండ్ బుక్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈబుక్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన టిఎ, సర్వీసు రూల్స్, జిపిఎఫ్, ఫండ మెంటల్ రూల్స్, పెన్షన్ రూల్స్, జిఐయస్ టేబుల్ తదితర అం శాలను పొందుపరచినట్లు ఎపిజిఇఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌భాషా, కెవిఎస్ శివారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఉద్యోగుల సర్వీసు రూల్స్‌లో రూపొందించిన డైర బాగుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్.కరిముల్లా, షాఖాదరి, నగర అధ్యక్ష, కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, కె.సాంబి రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎల్.పద్మావతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - తాడికొండ



రాష్ట్రంలో రాక్షస, సైకో పాలన సాగుతోందని టిడిపి నేత, మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు చింత కాయల అయ్యన్న పాత్రుడు విమర్శించారు. మండలంలోని మోతడకలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో అయ్యన్న పాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. టిడిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ యుగపురుషుడని కీర్తించారు. ఎన్టీఆర్ పరిపాలించిన కాలం స్వర్ణ యుగంగా అభివర్ణించారు.ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షసులు, దుర్మార్గులు,సైకో పరిపాలనలో ఉన్నామని, సైకో పాలన పోవాలంటే,సైకిల్ రావాలన్నారు. మనం,మన పిల్లల భవిష్యత్తు బాగుపడాలంటే టిడిపి అధికారంలోకి రావాలి..దాని కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని కోరారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లు శ్రావణ్ కుమార్,ధూళి పాళ్ళ నరేంద్ర, వై వి ఆంజనేయులు,భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎంఇఒలు అన్ని అంశాలనూ పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యాశాఖలో మండల విద్యాశాఖాధికారులకు మనబడి-నాడు నేడు కార్యక్రమం ఒక్కటే కాదని, ఇతర అన్ని రకాల అంశాలనూ పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణశర్మతో కలసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎంఇఒలు, ఏపిఎంలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖలో చాలా మార్పులు వస్తున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అప్‌డేట్‌గా ఉండాలన్నారు. విద్యార్థులందరూ యూనిఫామ్ ధరించే విధంగా చూడాలని, ప్రతి ఎంఇఒ వారంలో కనీసం 5 రోజులు పాఠశాలలను సందర్శించాలని, మధ్యాహ్న భోజనాన్ని ప్రతి పాఠశాలలో 85శాతం కంటే ఎక్కువ మంది భోజనం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సందర్శనకు వెళ్ళిన పాఠశాలలో తరగతి గదిలో జరుగుతున్న పాఠ్యాంశ బోధనను పరిశీలించాలని ఆదేశించారు. బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, ఎన్‌ఆర్ఎస్‌టిసిలు ఎక్కెడెక్కడ ప్రారంభించాల్సి ఉందో నివేదిక తయారు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ కోడిగుడ్లు, చిక్కీలను సరఫరాదారు నిర్ణీత సమయానికి పాఠశాలలకు అందించాలని, అలా చేయనివారిపై చర్యలుంటాయని హెచ్చరించారు.

మనబడి నాడు- నేడులో భాగంగా ఆర్వో ప్లాంట్‌లు జనవరి చివరికి అన్ని సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఇఒ పి.శైలజ, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్ఐడి మొదటి స్నాతకోత్సవం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శేఖర్ ముఖర్జీ

ప్రజాశక్తి -ఎఎన్‌యు

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడి) ప్రథమ స్నాతకోత్సవ వేడుకలను ఈ నెల 20వ తేదీన నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ శేఖర్ ముఖర్జీ తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇక్కడి ఎన్ఐడి భారత ప్రభుత్వ వాణిత్య మం త్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి గల రెండవ సంస్థ అని పేర్కొన్నారు. 50 ఏళ్లుగా అహ్మదాబాద్‌లో కొనసాగుతున్న ఎన్ఐడి తర్వాత భారత ప్రభుత్వ జాతీయ డిజైన్ పాలసీ ప్రకారం ఇది స్థాపించబడిందన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత రాజధానిలో ఎన్ ఐ డి 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం జరుగు తుందని చెప్పారు. నాగార్జున యూనివర్సిటీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవడం జరి గిందని చెప్పారు. వైవిధ్యమైన ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్టైల్ డిజైన్, అపారెల్ డిజైన్లలో బ్యాచిలర్ కోర్సులను అందిస్తుందని చెప్పారు. ఈ నెల 20న జరిగే మొదటి స్నాతకోత్సవంలో 49 మంది విద్యార్థులు బ్యాచిలర్ ఇన్ డిజైన్ డిగ్రీని పొంద బోతున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చేనేత,జౌళి శాఖ కార్యదర్శి కొలవంటి సునీత ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. సంస్థ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షులు , వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ ఆర్కే సింగ్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో కొన్ని అవ గాహన ఒప్పందాలు కూడా కుదుర్చుకోనున్నట్లు చెప్పారు. శేఖర్ ముఖర్జీతోపాటు డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఫియూష్ శర్మ, అకాడమిక్ కోఆర్డినేటర్ భూమయ్యబండి, స్నాతకోత్సవ కోఆర్డినేటర్ అర్నాబ్ సేనాపతి పాల్గొన్నారు.

శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు

ప్రజాశక్తి-నూజెండ్ల



శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని సౌత్ ఇండియా డెవలప్ మెంట్ అండ్ వెల్ఫేర్ బోర్డ్, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్ మెంట్ కమిటీ సభ్యులు టి. నరసింహం అన్నారు. మండలంలోని కొత్త జెడ్డవారిపాలెం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా గెలు పొందిన క్రీడాకారులకు బహుమతులను బుధవారం అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పార్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కష్టపడి పని చేసే నేతలు ,ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు. గ్రామీణ క్రీడల అబివృద్ధికి తమ శాఖ ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు, మరో ముఖ్య అతిథి పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఉన్నత విజయాలను సాధించాలన్నారు. మొదటి బహుమతి సాధించిన కొత్త జడ్డా వారిపాలెం టీమ్‌కు రూ.30, 116 రెండవ స్థానంలో నిలిచిన నడిగడ్డ జట్టుకు రూ.20,116, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ ట్రోఫీలను, అవార్డు లను అందజేశారు పార్ట్ అధ్యక్షులు డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య ,ఆర్డీవో వసంత బాబు, డి.ఎస్.పి విజయభాస్కర్, ఫారెస్ట్ రేంజర్ సయ్యద్ ఉషెన్, డిఎంహెచ్ఒ జి. శోభారాణి, జడ్పిటిసి జడ్డ సుబ్బులు రామయ్య, గ్రామ సర్పంచ్‌లు జి. పున్నరావు, ఎస్. ప్రసాద్, తహశీల్దార్ మధుబాబు, ఎంపిడిఓ ఎస్‌కె జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి-రాజుపాలెం

రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై షఫీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండమోడుకు చెందిన పదవ తరగతి చదువుతున్న బాలికను, అదే గ్రామానికి చెందిన ఇరవై రెండేళ్ల యువకుడు జంగాల కిరణ గత కొన్ని రోజులుగా తనను వివాహం చేసుకోవాలంటూ ఆమె వెంట బడి ఒత్తిడి చేస్తున్నాడు. ఈ మేరకు బాలిక ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.



22న ముస్లిమ్ సమాజ్ ములాఖాతీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఈ నెల 22న ముస్లిం సమాజ్ ములాఖాతీని గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ముస్లింల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ముస్లిం మత పెద్దల సమావేశం జరిగింది. ముస్లిం సమాజ్ ములాఖాతీకి అత్యంత ప్రాధాన్యత నెలకొన్నదని ఆయన వివరించారు. సమస్యల పట్ల, సమాజం పట్ల అవగాహన గల ముస్లింను ములా ఖాతీలో భాగస్వామ్యం చేయాలని అప్పిరెడ్డి కోరారు. ముస్లిం మత పెద్దలు హాఫీజ్ అబ్బాస్, హాఫీజ్ ఇర్షాద్, హాఫీజ్ సల్మాన్, హాఫీజ్ అయూబ్, మోలానా అబ్దుల్ రెహ్మాన్, ప్రభుత్వ క్వాజీ హాఫీజ్ ఉస్మాన్ సిద్ధిఖీ, కార్పొరేటర్లు మార్కెట్ బాబు, షేక్ రోషన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా ఛైర్మన్ షేక్ ఫరియాజ్, డాక్టర్ వై. షేక్ పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 69,995
మిర్చి ఎగుమతి	: 67,860
మిర్చి నిల్వ	: 35,933

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 26,000
నెం.5	10,000- 26,000
273	14,000 - 20,000
341	9,000 - 22,000
4884	12,500 - 18,000
సూపర్ 10	25,000 - 25,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 22,000
బడిగి	12,000 - 27,500
దేవనూరు డీలక్స్	11,000- 22,500
తాలుకాయలు	4,000 - 12,500
ఎసి	
334	14,000 - 23,000
341	18,000 - 18,000
తేజ	16,500 - 18,000
తాలుకాయలు	6,500 - 10,500

పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా మిట్టపల్లి రమేష్



ప్రజాశక్తి - నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా వైసిపి రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి అయిన మిట్టపల్లి రమేష్‌ను నియమితులయ్యారు. ఈమేకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మిట్టపల్లి రమేష్ వైసిపి ఆవిర్భావం నుండి ఆ పార్టీలో కొనసాగుతుండడంతోపాటు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. నరసరావుపేట మున్సిపల్ చైర్మన్ రేసులోనూ ఆయన ఉన్నా మున్సిపాల్టీకి ఎన్నికలు జరగలేదు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు, పల్నాడు జిల్లాలోని ఎమ్మెల్యేలకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలకు నకరికల్లు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - నకరికల్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండల కేంద్రమైన నకరికల్లు వంగా వెంకట రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 200 మీటర్ల పరుగులో నెమలి కంటి శ్రీనిజ ప్రథమ స్థానం, 400, 600 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, డిస్క్ త్రోలో పానాది లేఖ్యా సాయి ప్రథమ స్థానాన్ని, హైజంప్‌లో రమావత్ రవితేజ నాయక్ ప్రథమ స్థానాన్ని సాధించారు. వీరు ముగ్గురూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికనట్లు పీడీ చింతా పుల్లయ్య తెలిపారు. ఈనెల 20,. 21, 22 తేదీల్లో శ్రీకాకుళంలోని కోడి రామకృష్ణ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారిని హెచ్‌ఎం రంగాదేవి, పిఇటి షేక్ ఫాతిమా, కె.వెంకటేశ్వర్లు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మస్తాన్‌వలి అభినందించారు.

1, 2 తేదీల్లో ఫార్మసీ జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 1, 2 తేదీల్లో నిర్వహించే 'అడ్వాన్సస్ ఇన్ ఫైటో మెడిసిన్ అండ్ ఫైట్ నానో కాంపోజిట్స్' జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. అల్లోపతి మెడిసిన్స్‌లో వచ్చే డ్రగ్ రెసిస్టెన్స్‌ను దృష్టిలో పెట్టుకొని నేచురల్ ప్రొడక్ట్స్ ప్రాముఖ్యతను, ఉపయోగాలను తెలియపరచడమే సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. వివిధ రకాల కొత్త పద్ధతులను ఉపయోగించి నేచురల్ ప్రొడక్ట్స్ నుంచి కొత్త కొత్త మందులను తయారు చేయడమే ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమన్నారు. సదస్సుకు డైరెక్టర్‌గా ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పరిమిరవి వ్యవహరిస్తారని, కో-కన్వీనర్‌గా కె.విజయ్‌కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కెఇ ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డాక్టర్ ఎం.గాయత్రి రమ్య, డాక్టర్ డి.రవిచంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరిస్తారని చెప్పారు.



శాశ్వతంగా సబ్‌ప్లాన్ చట్టం

- దళిత, గిరిజన, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాలు డిమాండ్
- పల్నాడు జిల్లాలోని తహశీల్దార్లందరికీ వినతులివ్వాలని నిర్ణయం
- సిఎం జగన్ ఇప్పటికీ స్పందించకపోవడంపై నాయకుల ఆగ్రహం
- అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు సత్వరమే నిర్వహించి తీర్మానించాలని డిమాండ్

ప్రజాశక్తి - చిలకలూరిపేట/అమరావతి





చిలకలూరిపేట రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, అమరావతిలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని దళిత, గిరిజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో అమరావతిలోని తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాలు బుధవారం నిర్వహించారు. చిలకలూరిపేటలో సమావేశానికి కెవిపిఎస్ నాయకులు ఎస్.బాబు అధ్యక్షత వహించగా అమరావతిలో సమావేశానికి జి.సతీష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ త్వరలో గడువు తీరనున్న సబ్‌ప్లాన్ చట్టం కొనసాగింపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం స్పందించకపోవడం దారుణమని అన్నారు. సబ్‌ప్లాన్ చట్టం వల్ల ఎస్సీ, ఎస్టీ కాలనీల అభ్యున్నతికి కొంతమేరకైనా నిధులు కేటాయించాల్సి వచ్చిందని, సిసి రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశాన వాటికలు, నిరుద్యోగులకు రుణాలు దక్కాయని గుర్తు చేశారు. అయితే ఇది పూర్తిస్థాయిలో మాత్రం జరగలేదని, చట్టం అమలులో పాలకులకు చిత్తశుద్ధి లోపమే ఇందుకు కారణమని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ చట్టం కొనసాగింపుపై సిఎం నోరుమెదపకపోవడం ఎస్సీ, ఎస్టీల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని, చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించేలా తీర్మానాన్ని ఆమోదించాలని, నిధులూ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.7వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిందని, ఇది ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ ద్వారా దక్కాల్సిన నిధులనూ లేకుండా చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు ఉద్ఘాటించారు. ఉద్యమంలో భాగంగా జిల్లాలోని తహశీల్దార్లందరికీ గురువారం వినతి పత్రాలిస్తామని ప్రకటించారు. సమావేశం అనంతరం అమరావతిలో తహశీల్దార్ విజయశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. చిలకలూరిపేట సమావేశంలో వివిధ సంఘాల నాయకులు విల్సన్, పి.వెంకటేశ్వర్లు, బి.శ్రీనునాయక్, ఎన్.కోటేశ్వరరావు, వి.ముత్తయ్య, వై.సురేష్, పోలయ్య, రత్నరాజు, ఎన్.ఏసురాజు, జె.సురేష్ కె.రోశయ్య, అమరావతి సమావేశంలో ఎడ్ల రవిబాబు, బి.బాబురావు, కె.వెంకటేశ్వరరావు, టి.కృష్ణ, పాములు, టి.సుబ్బారావు, బి.సూరిబాబు, సయ్యద్ మోదిన్‌వలి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మోడల్ పరీక్ష విజయవంతం





పరీక్ష పేపర్లు ఆవిష్కరిస్తున్న ఏసీ కాలేజి ప్రిన్సిపాల్, డివైఎఫ్ఐ నాయకులు, నరసరావుపేటలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కానిస్టేబుల్ మోడల్ పరీక్ష విజయవంతమైనట్లు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న చెప్పారు. స్థానిక ఆంధ్రా క్రైస్తవ కళాశాలలో నిర్వహించిన మోడల్ పరీక్ష పేపర్‌ను తొలుత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మోజెష్ ఆవిష్కరించారు. రామన్న మాట్లాడుతూ మోడల్ పరీక్షకు హాజరైన అభ్యర్థులకు, సహకరించిన వారికి అభినందలు తెలిపారు. 22వ తేదీన జరిగే ప్రిలిమినరీ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని అకాంక్షించారు. గ్రూప్-2, డిఎస్సీ పోస్టుల భర్తీ కోసం రాబోయే కాలంలో జరిగే కార్యక్రమాలలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కాలేజి ప్రిన్సిపాల్ మోజెష్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ నిరుద్యోగ సమస్యలపై కృషి చేయడమే కాకుండా, ఇటువంటి మోడల్ పరీక్షలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్, నాయకులు పి.భార్గవ, ఎం.కిరణ్ కబీర్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు రూపస్, సుధీర్, నాయకులు అఖిల్, సుప్రజ, ఉదయ్, రినేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉద్యోగం సాధించాలంటే పట్టుదలతో పాటు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యమని, సాధించగలమనే నమ్మకంతో పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఒన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఒక ప్రయత్నంలో సాధించలేకున్నా నిరాశ పడకుండా కృషి చేయాలని, సాధించే వరకూ లక్ష్యంపైనే గురిపెట్టాలని సూచించారు. పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్షను స్థానిక రామిరెడ్డిపేటలోని వాసవి డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ప్రశ్నా పత్రాన్ని ఆవిష్కరించిన ఎస్ఐ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో డివైఎఫ్ఐ చొరవను అభినందించారు. అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడేలా ప్రశ్నా పత్రాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించారని చెప్పారు. ప్రణాళికతో చదివితే గమ్యం చేరవచ్చన్నారు. నోటిఫికేషన్ తర్వాత ప్రతిక్షణం ఎంతో విలువైందని, సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. పరీక్ష సమయంలో సమయపాలన ఎంతో ముఖ్యమని, నచ్చిన అంశాలను త్వరగా పూర్తిచేసి క్లిష్టమైన అంశాలకు ఆ తర్వాత సమయం కేటాయించాలని చెప్పారు. పరీక్షకు 90 మంది హాజరవ్వగా రాసిన అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఇది తమకెంతో ఉపయుక్తమని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయరాజు, సాయి, రాజ్‌కుమార్, సిఐటియు నాయకులు డి.శివకుమారి, ఇ.మస్తాన్‌రెడ్డి, సిలార్ మసూద్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పరీక్షంటే భయం పోయింది





ఈ మోడల్ పరీక్షకు హాజరవడం వల్ల మాలో చాలా వరకు భయం పోయింది. గతంలో శిక్షణ తీసుకున్నా ఇప్పుడు పరీక్ష రావడం వల్ల గతంలో తెలియని మరిన్ని విషయాలు తెలిసి కొత్త ఉత్సాహం వచ్చింది.

డి.రోజా, నందిగం, సత్తెనపల్లి మండలం.

జి.నాగమణి, నరసరావుపేట.

ప్రశ్నాపత్రం చాలా బాగుంది



ఈ ప్రశ్నా పత్రం అభ్యర్థులతోపాటు కోచింగ్ సెంటర్లలో కూడా ఉపయోగపడేలా ఉంది. ఈనెల 22న జరగబోయే అసలు పరీక్షకు సంబంధించి ఈ మోడల్ పరీక్ష పత్రంలో అర్థమెటిక్, కరెంట్ అఫైర్స్ అన్నింటినీ సమపాళ్లలో రూపొందించారు. ఇది మంచి ప్రశ్నాపత్రం.

బి.కిషోర్, డైరెక్టర్ మాస్టర్స్ అకాడమీ, నరసరావుపేట.

సిపిఎం సర్వేలో సమస్యలు కోకొల్లలు

జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలి

తాడికొండ మండలం లాంలో సిపిఎం బృందం పరిశీలన

ప్రజాశక్తి - తాడికొండ : 'నవ రత్నాలు - పేద లందరికీ ఇళ్ల పథకం' లో భాగంగా చేపట్టిన జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఇళ్ళ నిర్మాణ సామాగ్రి ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న లక్షా 80వేలతో ఇళ్ళ నిర్మాణాలు సాధ్య పడవని అన్నారు. తాడికొండ మండలం లోని లాం గ్రామంలో జగనన్న కాలనీలను బుధవారం పాశం రామారావు, సిపిఎం నాయకులు చింతల భాస్కరరావు, కనగాల పూర్ణయ్య, ఇమ్మిడి రామారావు తదితర ప్రతినిధి బృందం పరిశీలించింది. లబ్ధిదారులైన కొంతమంది మహిళలతో మాట్లాడగా వారు గృహనిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను సిపిఎం బృందానికి ఏకరువు పెట్టారు. ఇళ్ళ పరిశీలన అనంతరం రామారావు మాట్లాడుతూ లాం గ్రామంలో గుంటూరు ప్రాంతవాసులైన 7,500మందికి సుమారు 100 ఎకరాలలో ఒక సెంటు చొప్పున ఇళ్ళ స్థలాలు మంజూరయ్యాయని చెప్పారు. 30 శాతం ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని,70 శాతం మొదలు పెట్టాల్సివుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. కాలనీల్లో కనీస వసతులు కల్పించి లబ్ధిదారులకు రూ.5లక్షలు ఇస్తే ఇంటి నిర్మాణాలు కొనసాగుతాయన్నారు. త్వరితగతిన ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులపై ఎంత ఒత్తిడి తీసుకు వచ్చినా ప్రభుత్వ సాయం రూ. 5 లక్షలకు పెంచక పోతే ఇళ్ళ నిర్మాణాలు ముందుకు సాగవన్నారు.



లాం వద్ద జగనన్న కాలనీలో లబ్దిదారులతో మాట్లాడుతున్న పాశం రామారావు తదితరులు

ఇంటిపట్టా ఇప్పించండి...

120 ఏళ్ల వృద్ధురాలు వినతి



ప్రజాశక్తి - మంగళగిరి : సిపిఎం బృందం ర్వహిస్తున్న సర్వేలో 120 సంవత్సరాలు నిండిన బైరు బోయిన బాలనాగమ్మ అనే వృద్ధురాలిని నాయ కులు కలిశారు. ఆమెకు నాటి ఎన్టీ రామారావు ప్రభుత్వం ఉన్నప్పటి నుండి రూ.50 పింఛను, నేటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దగ్గర నుండి రూ.2,750 వస్తున్నట్లు తెలిపారు. అయితే తాము ఉంటున్న ఇంటికి బి ఫారం ఉన్న ప్పటికీ ఇంతవరకూ పట్టా ఇవ్వడం లేదని తెలి పారు. పట్టా ఇప్పించాలని నాయకులను కోరారు.

పెదపరిమిలో సిపిఎం బృందం పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు : జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ 1,80,000 లు సరిపోవని, రూ 5 లక్షలు ఇవ్వాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి కోరారు. మండలంలోని పెదపరిమిలో జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలను రవి, నాయకులు పేరం బాబురావు పరిశీలించారు. ఇళ్ళ నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులు గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఇళ్ళ నిర్మాణానికి 8 ఎకరాల 72 సెంట్లలో260 మందికి ఇళ్ళ స్థలాలు కేటాయించిందని, కేవలం 34 ఇళ్ళ నిర్మాణాలు మాత్రమే జరుగుతున్నాయ న్నారు.



పెదపరిమిలో జగనన్న కాలనీలో ఇంటిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

20వ డివిజన్‌లో రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు నగరంలో జరుగుతున్న అభివద్ధి పనుల నిర్వహణలో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం గుంటూరు నగరంలోని 20 వ డివిజన్‌లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 20వ డివిజన్‌లోని సంపత్ నగర్ చివర సచివాలయం రోడ్డు నందు వెట్‌మిక్స్ రోడ్డు, నూతనంగా వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్న రోడ్డులో జియస్‌బి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 20వ డివిజన్ వైసిపి అధ్యక్షులు కంతేటి శ్యాంశేఖర్, ఖాజా మొహిద్దీన్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాగూర్ షరీఫ్

ప్రజాశక్తి-గుంటూరు విజయవాడలో బుధవారం నిర్వహించిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో గుంటూరు జిల్లాకు చెందిన షేక్.నాగూర్ షరీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక య్యారు. మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సంఘం సీనియర్ నాయకులు షరీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికవటంపై జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగూర్ షరీఫ్‌ను, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఎస్.సతీష్‌కుమార్‌ను సంఘ నాయకులు ఘజమాలతో సత్కరించారు.



జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల్ని సత్కరిస్తున్న నాయకులు

మూడు దశాబ్ధాలుగా ఉంటున్నా ఇంటి పట్టాల్లేవు



ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణం లోని 30 వ వార్డు పార్కురోడ్డులో బుధ వారం సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిం చారు. ఈ సందర్భంగా సర్వే బృందానికి ప్రజలు ఎదుర్కొం టున్న అనేక సమస్య లను గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు అరకొర ఇస్తున్నారని, సొంత ఇల్లు కూడా లేదని పేదలు సిపిఎం బృందానికి తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పి ఇచ్చిన కాగితాలకు విలువ లేకుండా పోయిందని, సుమారు 30 సంవత్సరాల నుండి పార్క్ రోడ్డులో ఉన్న 30 ఇళ్లలో నివాసముంటున్న 50 కుటుంబాలకు ఇంతవరకూ పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. 30 వ వార్డు యాదవపాలెం రైలు కట్ట వద్ద ఉన్న నివాస ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొనుటకు సిపిఎం నాయకులు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్వేల్లో ప్రజలు అనేక సమస్యలు చెబుతున్నారని ఇంటికో సమస్యగా కనిపిస్తోందని అన్నారు. చెత్త పన్ను వసూలు చేయడానికి వివిధ సంక్షేమ పథకాలు నుండి డబ్బులు కట్ చేస్తామని బెదిరించి చెత్త పన్ను వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీ ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుర్రా ఏడుకొండలు, ఎం బాలాజీ, నల్లబోతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాం.. ఇంటి స్థలాలివ్వలేదు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ మండలం నూతక్కి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల సమస్యపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అనేక సమస్యలను సిపిఎం బృందానికి తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ పత్రం ఇచ్చారని ఇంతవరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు లేక వేల రూపాయల చెల్లిస్తూ అద్దెలకు ఉంటున్నామని ప్రభుత్వం మా నివాస ప్రాంతాల వద్దనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, డ్రైనేజీ సమస్య పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వం మూడు వేల మందికి పైగా ఇళ్ల స్థలాల మంజూరు చేస్తామని హామీ పత్రాలు ఇచ్చిందని, నూతక్కి గ్రామంలో 291 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ పత్రాలు ఇచ్చారని ఇప్పటివరకు భూమి ఎక్కడ ఉందో చూపించలేదని, రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని అది కోర్టులో ఉందని కోర్టులో పరిష్కారమైన వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని అధికారులు అంటున్నారని ఇలా ఎన్ని సంవత్సరాలు ఎదురు చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సెంటు భూమిలేని పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి రూ.ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకోవడం కోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మంగళగిరి మండల నాయకురాలు వల్లూరి భారతి, సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు ఇట్లూరి సీత మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నూతక్కిలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

కరెంటు బిల్లుల మోత మోగిపోతోంది



తాడేపల్లిలో సిపిఎం బృందానికి సమస్యలు చెబుతున్న ప్రజలు

ప్రజాశక్తి-తాడేపల్లి



ప్రస్తుతం వస్తున్న కరెంటు బిల్లులు చూస్తే గుండె గుభేల్ మంటుందని, తమ జేబులకు చిల్లుపడి తమకు మోత మోగి పోతుందని ఇస్లాంపేట, లెనిన్‌నగర్, జగ్జీవన్‌రావు కాలనీ, రామయ్య కాలనీ, శివదుర్గాపురం, సుందరయ్య ప్రెస్ కాలనీలోని ప్రజలు సిపిఎం బృందం ముందు వాపోయారు. బుధవారం పై ప్రాంతాల్లో సిపిఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరెంటు బిల్లుల ఇంటి అద్దె కంటే ఎక్కువగా వస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని దాని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జగనన్న ఇంటి పేరుతో గతంలో హామీ పత్రాలు ఇచ్చిన అధికారులు నేటి వరకు ఇళ్లస్థలాలు చూపించలేదని, ఇళ్లపట్టాలు ఇవ్వలేదని సిపిఎం నాయకులకు తెలిపారు. తాము ఉంటున్న ఇళ్లను రెగ్యులరైజేషన్ చేసి ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేముల దుర్గారావు, ఎం.మల్లేశ్వరి, వి.వెంకన్న, ప్రసాద్, ఎన్‌కె ఇర్ఫాన్ పాల్గొన్నారు.

23న రాయభారం : తాడేపల్లి పట్టణంలోని వివిధప్రాంతాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 23వ తేదీ తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారుల వద్దకు రాయభారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వేముల దుర్గారావు తెలిపారు. ఈ రాయభారం కార్యక్రమానికి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు తరలిరావాలని కోరారు.

అధిక ధరలతో ఆదాయాలు తగ్గిపోయాయి

సిపిఎం సర్వేలో చిరు వ్యాపారుల ఆవేదన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ధరల అధికంగా పెరగడం వలన, నిత్యవసర వస్తువులు ఏమీ కొనే పరిస్థితిలో లేవని, ఆదాయాలు పూర్తిగా తగ్గి పోయాయని కొలను కొండలోని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎం టి ఎంసీ పరిధిలోని కొలనుకొండ లో బుధవారం రాత్రి సిపిఎం నాయకులు చిరు వ్యాపారుల సమస్యలపై సర్వే నిర్వహించారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా నూనెలు, పప్పులు, బియ్యం ధరలు విపరీతంగా పెరగటం వలన బైపాస్ సర్వీస్ రోడ్డు కిరువైపులా ఉండే చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని ఆదాయాలు కూడా గణనీయంగా తగ్గటం వలన అనేక ఇబ్బందులు పడుతున్నామని సిపిఎం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలలో భాగంగా ధరలు విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. ధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ధరల పెరుగుదల కారణంగా సామాన్య ప్రజానీకం కొనుగోలు శక్తి కూడా తగ్గిందని ఆయన అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వలన నిత్యవసర వస్తువులపై ధరల ప్రభావం పడి పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పెరిగిన ధరలను తగ్గించాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సర్వేలో సిపిఎం కొలనుకొండ గ్రామ శాఖ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభ్యున్నతికి కృషి చేయాలి

మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు తురకా నరసింహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో సంచార, అర్ధ సంచార, విముక్త జాతులలో నిరాదరణకు గురైన వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సౌత్ ఇండియా డెవలప్ మెంట్ అండ్ వెల్ఫేర్ బోర్డ్, మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్ మెంట్ కమిటీ సభ్యులు తురకా నరసింహం సూచించారు. కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత జెసి శ్యామ్ ప్రసాద్ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారు లను పరిచయం చేశారు. జిల్లాలో సంచార, ఎస్సి, ఎస్టీ, బీసి, సామాజిక వర్గాల అభ్యు న్నతికి చేస్తున్న కృషిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అట్టడుగు వర్గాలకు చెందిన వారిలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన,ఎస్సీ, ఎస్టి కోసం కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వ ర్యంలో నవోదయం, జగనన్న బడుగు వికాసం వంటి పథకాల ద్వారా ఉపాధి, వ్యాపార, పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశాలు, ప్రతి నెల నిర్వహించి ఇప్పటికే అనేక మంది అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నరసింహంకు వివరించారు. ఆయా శాఖల అధికారులు సైతం తాము సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల అభివృద్ధికి చేస్తున్న కృషిని తెలియజేశారు. నరసింహం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వెనుకబడిన వర్గాలతో పాటు సంచార,అర్ధ సంచార, విముక్త జాతుల అభివృద్ధిలో ఎక్కువగా ఎస్సి, ఎస్టీ, దేవదాసి, జోగినీ, ఎరుకుల, యానాది, సంచార జాతులు, వీర భద్ర , దొమ్మర, బేడ, బుడిగ జంగం, అగ్ర కులాల్లో బాగా వెనుక బడిన సామాజిక వర్గాల వారు, అనేక మంది పేదలు, ఆపదలో ఉన్నవారు, దాడులకు గురైనవారు ఇప్పటికీ అనేక ఒడిదుడు కులను ఎదుర్కొంటున్నారని, వారిని మాన వత్వంతో ప్రభుత్వం, అధికారులు ఆదుకోవా లని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరికీ, సామాజిక న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. భవిష్యత్తు తరాల వారికి న్యాయం చేసే బాధ్యతను తీసు కోవా లని అధికారులకు సూచించారు. సమా వేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినా యకం, కలెక్టరేట్ ఎ.ఓ అనిల్ కుమార్ ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తురకా నరసింహం. చిత్రంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు



జాతీయ రహదారుల భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి శ్యాం ప్రసాద్ తదితరులు

రోడ్డు ప్రమాదాల నివారణకు

సమన్వయంతో పని చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, పోలీస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభా గం, రోడ్లు భవనాల శాఖ సమ న్వయంతో పని చేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. ఈ నెల 18వ తేదీ నుండి 24 వరకు జాతీయభద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం డిస్ట్రిక్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారుల భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జెసి మాట్లా డుతూ జిల్లాలో ట్రాఫిక్ నిబం ధనలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. డిటిసి పరం ధామరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏడాదికి 8, 000 మందికి పైగా మృతి చెందుతున్నట్లు చెప్పారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో అధిక వేగంతో వాహనాలు నడ పడం నిరోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శోభారాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



విజేతకు బహుమతి అందజేస్తున్న జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్

సంక్రాంతి పండుగ సం దర్భంగా జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక 32 వార్డు లోని మార్కండేయ నగర్ లో ముగ్గుల పోటీలను నిర్వహిం చారు. బుధవారం సాయం త్రం జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథి జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను పాటించడం ద్వారా వాటిని కాపాడుకోవా లని సూచించారు. అనంతరం విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడోవ బహుమతి రూ.2 వేలు, నాల్గవ బహుమతి కింద రూ.వెయ్యి అందజేశారు. 15 వ వార్డు కౌన్సిలర్ జె. సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్ట ణంలోని పలు ప్రాంతాలలో ఉన్న ఎన్టీ ఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నియో జకవర్గ టిడిపి ఇన్ ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని దేశానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ప్రశంసిం చారు. ఈ సం దర్భంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్ట నున్న యువగళం పాద యాత్ర విజయవంతం కావాలని ఆకాం క్షిస్తూ పట్టణంలో ద్విచక్ర వాహన భారీ ర్యాలీ నిర్వహించారు. టిడిపి కార్యా లయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజ నేయులు సమక్షంలో 'యువగళం' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాచర్ల నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి,రాష్ట్ర గ్రంథా లయ శాఖ చైర్మన్ దాసరి రాజా మాస్టర్ పాల్గొన్నారు. **సత్తెనపల్లి రూరల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. గుడిపూడి, గోరంట్ల , నందిగామ కట్టమూరు ,కొమెరపూడి గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వ హించారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజ నేయులు గుడిపూడి, గోరంట్ల గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎ.సాంబయ్య, మండల టిడిపి అధ్యక్షులు ఎ.అమరేశ్వం రావు, జి.అప్పారావు, ఎల్.గజానన పాల్గొ న్నారు. **వినుకొండ:** స్థానిక గంగినేని కళ్యాణ మండపంలో వినుకొండ టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వ హిం చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కొని యాడారు. మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లో చైత న్యాన్ని నింపాలని, అరాచక వైసిపి పాల నను సాగనంపాలని పిలుపు నిచ్చారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు

స్థానిక గంగినేని కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జివి ఆంజ నేయులు ప్రారంభించారు. జీవి ఆంజ నేయులు తో పాటు సుమారు 605 మంది రక్తదానం చేశారు. స్థానిక 32వ వార్డులో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. **చిలకలూరి పేట:** పట్టణంలో, నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను టిడిపి శ్రేణులు నిర్వహించాయి. ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, తెలుగు యువత, ఐ-టీడీపి,టి ఎన్ ఎస్ ఎఫ్, ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రారం భించారు. అనం తరం బైక్ ర్యాలీ తో బయలుదేరి ఎన్ఆర్‌టి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి ప్రత్తిపాటి పుల్లారావు గజమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానాలు, చీరల పంపిణి వంటి కార్య క్రమాలు పార్టీ శ్రేణులు నిర్వ హించాయి. అదే విధంగా, యడ్లపాడు లోని పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో, విజయపురిసౌత్‌లో, నాగుల వరం లో, మాచవరంలో, నాదెండ్ల మండలం లోని సాతులూరులో,అమిన్ సాహెబ్ పాలెంలో, ముప్పాళ్ల మండలంలోని గ్రామాల్లో, పెదకూరపాడు మండలంలోని పెదకూర పాడు, పరస, అబ్బ రాజుపాలెం, గారపాడుతో పాటు పలు గ్రామాల్లో, రాజుపాలెంలోని మండల పరిషత్ కార్యా లయం ఆవరణలో,ఎన్టీర్ ట్రస్ట్, మధర్ తెరిస్సా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించి, నివాళులర్పించారు.



నరసరావుపేటలో యువగళం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు



23వ వార్డులో పర్యటిస్తున్న కౌన్సిలర్ షకీల

ప్రతి ఇంటికీ కుళాయి

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక 23వ వార్డులో ఇటీవల నిర్మించిన సిసి రోడ్డుకు ఇరువైపులా గతంలో ఉన్న మంచినీటి పైపుల స్థానంలో నూతన పైప్ లైన్ పనులను ప్రారంభించే నిమిత్తం కౌన్సిలర్ షకీల బుధవారం పరిశీలించారు. స్థానికులను అడిగి వార్డు లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి మం చినీటి కుళాయి కనెక్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసు కుంటామని ఆమె చెప్పారు. 23వ వార్డు కౌన్సిలర్ నన్నేసా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పావలా వడ్డీ అందని ద్రాక్ష : టిడిపి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మహిళలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పెదకూరపాడు మండల తెలుగు మహిళ నేతలు అన్నారు. బుధవారం మండలంలోని జలాల్పురంలో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. పావలా వడ్డీ డ్వాక్రా మహి ళలకు అందని ద్రాక్షగా మారిందని, మహిళలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి దానిని ఆట కెక్కిం చారంటూ వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎస్. కృష్ణకుమారి, షేక్ ముం తాజ్, ఎన్.ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని 25వ రోజు గణపవరంలోని 4వ వార్డు పరిధిలోని 26వ బూత్ లో బుధవారం నిర్వహించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు చేప ట్టకపోగా ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. చంద్ర బాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథం లో నడిచే విధంగా సహకరించాలని కోరారు. 5 వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి షేక్ హుస్సేన్, సిహెచ్ కృష్ణ, డి.కిషోర్, పి.మాధవ, లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో భారీ అవినీతి

నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ఆరోపణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక మున్సిపాలిటీలో భారీ అవినీతి చోటు చేసు కుందని, చేయని పనులను చేసినట్టుగా చూపుతూ బిల్లు లకు డబ్బులు తీసుకున్నారని ఆరోపిస్తూ ఎపి మునిసిపల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు నవతరంపార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం వినతిపత్రం సమర్పించారు. స్థానిక కృష్ణ మహల్ వద్ద గల తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఈ వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. మునిసిపాలిటిలో లక్ష లాది రూపాయలు బిల్లులు, తప్పుడు దస్త్రాలు పెట్టి డ్రా చేస్తు న్నారని, అధికారులు అవినీతికి పాల్పడ్డారని మునిసిపల్ డైరె క్టర్ కు వివరించామని, దీనిపై విచా రణ జరపాలని కోరి నట్లు చెప్పారు మునిసిపాలిటిలో డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇం జనీర్ (డివైఈఈ) టి.వెంకట రమణ, ఇంజనీరింగ్ విభా గానికి సంబంధించిన ఈ1 గుమాస్తాలు దొంగ బిల్లులు పెట్టారని ఆరోపించారు. మునిసిపాలిటీలో జరిగిన, జరుగు తున్న అవినీతి పై దర్యాప్తు జరిపించాలని, బాధ్యులను తగిన విధంగా శిక్షించాలని నవ తరం పార్టీ డిమాండ్ చేస్తోం దన్నారు. కాగా, ఈ విషయమై మున్సి పల్ డివైఈఈ వెంకట రమణ బుధవారం మాట్లాడుతూ ఇవన్నీ అబద్ధాలని, అసత్య ఆరోపణలను కొట్టిపారేశారు..

అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లతో అవస్థలెన్నో..!

ప్రజాశక్తి-తెనాలి

నిత్యం రద్దీగా ఉండే రోడ్డు అధ్వాన్యంగా తయారై నడిరోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీర్ఘకాలికంగా రోడ్డు దుర్భరంగా ఉన్నా పట్టించుకునే నాధుడే లేడు.దీంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. నిత్యం ఇదే మార్గంలో ప్రయాణించే అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్ల దుస్థితిని చూస్తున్నా ఏమాత్రం స్పందించక పోవడం గమనార్హం.

తెనాలి-విజయవాడ ప్రధానమైన రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. బస్టాండ్ నుంచి పరిశీలిస్తే ఆటో నగర్ వరకూ డివైడర్ ఉంది. దీంతో వాహనాల రాకపోకలు ఒన్‌వేలో వెళ్ళాల్సిందే. ఈ మార్గంలో నందివెలుగు నుంచి తెనాలి వచ్చే క్రమంలో ఆటోనగర్, సోమసుందరపాలెం, విస్సార్ కళాశాల వద్ద రోడ్డు పూర్తిగా పాడైంది. నడిరోడ్డులో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ద్విచక్రవాహనం మొదలు, కార్లు, ఆటోలు, బస్సులు అన్నీ ఆగి నెమ్మదిగా వెళ్ళాల్సిందే. అయినా ఒళ్ళు హూనం కాక తప్పదు. ఈ పరిస్థితి ఇప్పటిది కాదు. దాదాపు నాలుగేళ్లుగా ఈ రోడ్డు దుస్థితి ఇలాగే ఉంది. ఈ మార్గంలో ఉద్యోగులు, వ్యాపారులు, అధికారుల నిత్యం తిరుగుతూ ఉంటారు. అయితే ఏ ఒక్కరూ రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించకపోవటం బాధాకరం. పెదరావూరు నుంచి ఆటోనగర్ వరకూ నాలుగు లైన్ల విస్తరణలో భాగంగా బస్టాండ్ నుంచి ఆటో నగర్ వరకూ ఓ వైపు మాత్రమే రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రెండో వైపు అలాగే వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. రోడ్డు నిర్మాణం వంకతో కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో వాహన చోదకులు బాగున్న రోడ్డులో ఎదురుగా ప్రయాణించటం, రోడ్డు ప్రమాదాలకు గురికావటం పరిపాటిగా మారింది. అధికారులు మాత్రం రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వాహన చోదకులు ఇష్టానుసారం ప్రయాణించకుండా డివైడర్లు ఏర్పాటు చేశామని, వాటి ప్రకారం ఎటు వెళ్ళాల్సిన వాహనాలు అటుగానే వెళ్ళాలని, నిబంధనలు అతిక్రమిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాల తీవ్రతను, రోడ్డు దుస్థితిని, దృష్టిలో ఉ ంచుకోని కనీసం మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మరమ్మతులైనా చేయాలంటున్న వాహనదారులు


విఎస్సార్ కళాశాల వద్ద గుంతల పడిన రోడ్డు


ఆటోనగర్ వద్ద గుంతలు పడిన రోడ్డు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని హైవే టవర్స్, ఉషోదయ సూపర్ మార్కెట్, విజయ అపార్టుమెంటు ఏరియాల్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ ఎ.సత్యనారాయణ, ఎఇ నాగమల్లేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.వినియోగ దారులు సహకరించాలని కోరారు.

షేక్ మహమ్మద్ జానీకి సిపిఎం నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరు సీలింగ్ భూమి లబ్ధిదారుడు షేక్ మహమ్మద్ జానీ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బుధవారం తుళ్లూరులో జానీ మృతదేహాన్ని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి,పేరం బాబూరావు,జె నవీన్ ప్రకాష్ సందర్శించినివాళి అర్పించారు. తుళ్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీలింగ్ భూమిని లబ్ధిదారులకు అప్పగించేందుకు జరిగిన భూ పోరాటంలో షేక్ మహమ్మద్ జానీ చురుగ్గా పాల్గొన్నారని రవి శ్లాఘించారు. జానీ మృతి పట్ల మాజీ మంత్రి,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, కొరివి వినయ్ కుమార్, పువ్వాడ సురేంద్ర సంతాపం తెలిపారు.

రోడ్ల నిర్మాణాలకు రూ.89.23 లక్షల కేటాయింపు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని జగనన్న కాలనీలలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.89.23 లక్షల కేటాయించినట్లు హౌసింగ్ ఏఈ ఎస్‌కేఎం.ష తెలిపారు. మండల వ్యాప్తంగా 2,567 మందికి ప్లాట్లు ఇవ్వగా ఇప్పటి వరకు 894 మంది లబ్ధిదారులు ఇంటి పనులు ప్రారంభించగా 126 ఇల్లు పూర్తయినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయడానికి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పెదకొండూరు గ్రామంలోని లేఅవుట్లలో రోడ్లు వేయటానికి నాలుగో పాయింట్‌కు రూ. 9 లక్షలు, తుమ్మపూడిలో రూ.2.15 లక్షలలతో రోడ్డు నిర్మాణం పూర్తికాగా రెండో రోడ్డుకు రూ.4.95 లక్షలతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. దుగ్గిరాల గ్రామంలోని లేఅవుట్‌కు రూ. 20లక్షలు కేటాయించగా రూ.15 లక్షలతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గోడవర్రులో రూ.4.50 లక్షలతోపనులు ప్రారంభించారని తెలిపారు. పెనుమూలిలోని కాలనీకి రూ.6.80లక్షలు, ఈమని గ్రామానికి రూ.10లక్షలు, చిలువూరు గ్రామానికి రూ.9.60 చుక్కపల్లి వారి పాలెం గ్రామంలోని ప్లాట్లకు రూ.4.98 లక్షలు కేటాయింపులు జరిగాయన్నారు. అన్ని గ్రామాలలోని కాలనీలకు నీటి సరఫరా విద్యుత్ లైన్లో పనులు పూర్తయినట్లు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

ప్రజాశక్తి -తెనాలి :పట్టణంలోని వైయస్సార్ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు మలేరియా వ్యాప్తిపై శిక్షణ తరగతిని బుధవారం నిర్వహించారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి కార్యాలయంలోని ఇంచార్జ్ సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి ,సబ్ యూనిట్ అధికారి కె ఉమాకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రక్త నమూనాల సేకరణలోనూ, సేకరించిన తదుపరి ఎప్పటికప్పుడు స్టెయిన్ చేసి వ్యాధి నిర్ధారణలోనూ అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని ఆదేశించారు. మలేరియా సూపర్ వైజర్ దీపాల శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్లు పత్తి సుధీర్ కుమార్, కమలాకర్ గుప్తా, శ్రీవిద్య, ధనలక్ష్మి, ,శివకృష్ణ, షేక్ బాషీద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -మంగళగిరి:మంగళగిరి నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వద్ద సుమారు 250 మంది పేదలకు రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మంగళగిరి పట్టణ సిఐ బి అంకమ్మరావు ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు ఆహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లక్ష్మయ్య, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ విజయ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.సిఐ అంకమ్మరావుకు కార్యక్రమం నిర్వాహకులు పూల బొకే అందజేసి స్వాగతం పలికారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల నాయకులు

మైనార్టీలను హింసించడం హేయం

ప్రజాశక్తి - చేబ్రోలు:ఫ్లెక్సీల వివాదంలో మైనార్టీలను హింసించడం హేయమని, వారిపై 307 సెక్షన్‌కింద కేసులు పెట్టి జైల్లో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చేబ్రోలు మండల టిడిపి నాయకులు అన్నారు. బుధవారం మాజీ సిఎం నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టిడిపి మండలం కార్యాలయంలో మండల అద్యక్షుడు మైలా వెంకట రామరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, వడ్లమూడి మాజీ సర్పంచ్ వీరంకి రంగారావు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో మైనారిటీ యువత పై జరిగిన పీలేరు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేసి పీలేరు జైల్లో పెట్టి హింసించటం అత్యంత బాధాకర విషయమని జగన్ మైనార్టీ ఓట్లతోనే సీఎం అయ్యారని అది మర్చిపోయి మైనార్టీలపై పక్షపాతం చూపిస్తున్నారని అన్నారు. ఇలాంటి కుట్రపూరిత చర్యలు మానకుంటే రాబోయే ఎన్నికల్లో మైనార్టీల ఓట్లతో తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు.కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పలువురు నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. యువగళం పేరుతో జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయాలని పలువురునాయకులు పిలుపునిచ్చారు.

కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు, ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలోని సిబ్బందికి నిత్యావసర సరుకులు పంపిణి చేశారు. నగర ప్రాంతాలలో అన్నదానం చేశారు. మాజీ శాసన సభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ శ్యాసనమండలి సభ్యులు రాయపాటి శ్రీనివాస్, టిడిపి నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, కొమ్మినేని కోటేశ్వరావు, ఈరంటి వరప్రసాద్‌లు పాల్గొన్నారు.

గుంటూరు లీగల్:స్థానిక జిల్లా కోర్టు వద్ద బుధవారం టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఎన్‌టి రామారావు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు నగర టిడిపి అధ్యక్షులు డేగల ప్రభాకర్, గుంటూరు తూర్పు ఇన్‌ఛార్జి నజీర్ అహ్మద్, మాకినేని పెదరత్తయ్య, చిట్టాబత్తిని చిట్టిబాబు, టిడిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు చుక్కపల్లి రమేష్, కార్యదర్శి శ్రీరాం రాజీవ్ ఆనంద్, న్యాయవాదులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర ప్రారంభించారు. **తెనాలి:** మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలను కొత్తపేటలోని టిడిపి కార్యాలయలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరాన్ని ప్రముఖ వైధ్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ప్రారంభించారు. పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్డులో పేదలకు అన్నదానం చేశారు. తొలుత పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి, మార్కెట్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిచారు. **దుగ్గిరాల:** టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు ఆధ్వర్యంలో రామారావు 27వ వర్ధంతిని రైలు పేటలో ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. స్థానిక ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత గద్దె శ్రీనివాస్ , మండల పార్టీ అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత తదితరులు పాల్గొన్నారు. **పెదనందిపాడు రూరల్:** పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, రావి శివరామకష్ణయ్యల ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ప్రదర్శనగా వెళ్లి హరిజన కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి బాపట్ల పరిశీలకులు రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఇనగంటి జగదీష్ బాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. **చేబ్రోలు:**మండల కేంద్రమైన చేబ్రోలు, నారాకోడూరు,సుద్దపల్లి,వడ్లమూడి,శేకూరు గ్రామాల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలకు సంగం డైరీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. **పొన్నూరు రూరల్ :** పొన్నూరు టిడిపి మాజీ ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం ఐలాండ్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. **తాడేపల్లి రూరల్:** ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి టిడిపి మండల కార్యాలయంలో బుధవారం ఎన్‌టిఆర్ వర్ధంతి వేడులకు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి జ్యోతి బస్, సీనియర్ నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎస్.కె నాగుల్, కుంచనపల్లి గ్రామ ప్రధాన కార్యదర్శి బి.రమేష్, కె.మహేశ్వర రావు, కె. మాణిక్యం, జి, వేణుగోపాల రెడ్డి, టి. ఏలియా తదితరులు పాల్గొన్నారు.**పెదనందిపాడు:** మండలంలో టిడిపి శ్రేణులు , ఎన్టీఆర్ అభిమానులు ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వరగాని గ్రామంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు చెన్నుపాటి సురేంద్ర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, సెంటర్లో పార్టీ జెండా ఎగరవేసి, ఎన్టీఆర్ కు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోపూరి వెంకటప్పయ్య, తదితరులు పాల్గొన్నారు. **తుళ్లూరు:** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు తుళ్లూరు, పెదపరిమి తదితర గ్రామాల్లో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు. పెదపరిమిలో భాష్యం ప్రవీణ్, ఎన్. రామారావు, కె. శ్రీనివాసరావు,పి రామచంద్ర రావు, తుళ్లూరులో డి.శ్రీనివాసరావు, డి,వెంకటేశ్వరరావు, కె.అప్పారావులు పాల్గొన్నారు. **తాడేపల్లి**: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు వర్ధంతి సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం, గణేష్ కళా మందిరనం వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిచారు.పట్టణ ప్రధాన కార్యదర్శి దాసు, సిహెచ్.శివుడు, ఎం.గోపాలరావు, పాల్గొన్నారు. కొల్లిపర: టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మండల గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు.నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.


గుంటూరు


తాడేపల్లి


కుంచనపల్లి

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

పోలింగ్ కేంద్రాల్లో అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - పల్నాడుజిల్లా

ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జెసి ఏ. శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సంబంధిత ఎలక్షన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్స్ డే సందర్భంగా ప్రతి మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గులు మరియు క్విజ్ పోటీలు నిర్వహించాలని మండల స్థాయిలో ఎన్నికైన వారిని నియోజకవర్గాల వారిగా నియోజకవర్గాల వారీగా ఎన్నికైన వారిని జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనేలా చూడాలన్నారు. ఓటర్స్ డే సందర్భంగా ఈనెల 27వ తారీఖున నరసరావుపేట పట్టణంలో 2కె రన్‌ను నిర్వహించాలని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రవీంద్రను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి అద్దయ్య, నరసరావుపేట తహసిల్దార్ రమణ నాయక్ , కలెక్టర్ కార్యాలయ ఎలక్షన్ సూపరింటెండెంట్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా జెసి ఎ శ్యాం ప్రసాద్

నూరు శాతం ఉద్యోగాలే కెఎల్‌యు లక్ష్యం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంబిఎ చదవడమంటే నాలుగు గోడల మద్య కూర్చుని చదవడం మాత్రమే కాదని ఆధునిక వ్యాపార రంగంలో పెరిగిన పోటీకి అణుగుణంగా ఎంబిఎ చదవుతున్న విద్యార్థులు తయారవ్వాలని కెఎల్ విశ్వవిద్యాలయం డీన్ ఎం.హెచ్.ఎస్. డాక్టర్ ఎం.కిషోర్ బాబు అన్నారు. బుధవారం నాడు కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంబిఎ సదస్సులో ఆయన ప్రసంగించారు. జాతీయ స్థాయిలో ఎంతో ప్రఖ్యాతి గాంచిన ఇమార్టికస్ అనే విద్యా సంస్థతో కలిసి కెఎల్ బిజినెస్ కళాశాల సంయుక్తంగా నిర్వహించనున్న ఎంబిఎ- ఫిన్‌టెక్ అనే కార్యక్రమనికి ప్రారంభోత్సవం చేశారు. ఇమార్టికస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అపూర్వ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంబిఎ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య అధ్యక్షత వహించిన ఆమె అతిథులను ఆహ్వానించిన అనంతరం సభనుద్దేశించి మాట్లాడారు. కెఎల్ బిజినెస్ కళాశాల 2009లో తమ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ప్రారంభించిన నాటి నుండి అనేక విజయాలను తమ విద్యార్థులు సాదిస్తూనే ఉన్నారన్నారు. ఎం.హెచ్ ఎస్. డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు మాట్లాడుతూ ఆక్స్ వర్డ్, హార్వార్డ్ లాంటి విదేశీ విశ్వవిద్యాలయాలతో తమ విశ్వవిద్యాలయానికి ఒప్పందాలు ఉన్నాయన్నారు. వంద శాతం ఉద్యోగాల కల్పన తమ ప్రత్యేకత అని ఆయన అన్నారు. ఇమార్టికస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అపూర్వ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎంబిఎ-ఫిన్‌టెక్ విద్యార్థులకు ఉద్యోగ కార్యక్రమంలో ఐఐటి రూర్కీ యాజమాన్య అధిపతి డాక్టర్ రజత్ అగర్వాల్, విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డీన్ ఎంహెచ్ ఎస్ డాక్టర్ కిషోర్‌బాబు



ఆల్ఫాకేఫ్ సెంటర్లో నారా లోకేష్ సందడి

సెల్ఫీలు..యువతతో మాటామంతీ

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి పట్టణంలో బుధవారం సాయంత్రం వేళ యువగళం ప్రతిధ్వనించింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అకస్మాత్తుగా ఆల్ఫా హోటల్ ఏరియాలో కాన్వాయ్ దిగారు. వెళ్తూనే ఆ ప్రాంతంలోని రెస్టారెంట్లో ఇడ్లీ ఆర్డర్ ఇచ్చారు. వేడి వేడి ఇడ్లీ వచ్చేలోపు తన టేబుల్ ఎదురుగా ఉన్న ఇద్దరు ఐటీ ప్రొఫెషనల్స్‌తో మాట కలిపారు. 20 నిమిషాలకు పైగానే రాష్ట్రంలో ఐటీ పరిస్థితి, వారి ఉద్యోగం, స్థితిగతులు, ఉద్యోగావకాశాలపై చర్చ సాగింది. ఈ లోగా నారా లోకేష్ అక్కడున్నారని తెలిసిన యువత పెద్ద ఎత్తున చేరుకున్నారు. సెల్ఫీల సందడి ఆరంభమైంది. ఇడ్లీ తిని వారికి బిల్లు చెల్లించి, టీ స్టాల్ దగ్గరకొచ్చి ఇరానీ టీ తాగారు. యజమానులతో మాటలు కలిపారు. మంగళగిరిలో లోకేషే గెలుస్తారని తమ హోటల్ కి వచ్చేవారు రోజూ అనుకుంటున్నారనే సంగతి వారు యువనేతకి చెప్పి సంతోషం వ్యక్తంచేశారు. ఆల్ఫా సెంటర్లో లోకేష్ సందడి చేస్తున్నారని యువత గుంపులు గుంపులుగా తరలివచ్చారు. ఇదే సమయంలో ఈ ఒక్క ఏరియాలో పవర్ కట్ చేశారు. అందరి సెల్‌ఫోన్ల లైట్లు వెలిగాయి. తాను నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ ఓపిగ్గా సెల్ఫీలు దిగారు. పాన్ షాప్ వారితో మాటలు కలిపారు. అక్కడ సిగరెట్లు తాగుతున్న యువతతో ఆరోగ్యం పాడు చేసుకోవద్దని సలహా ఇచ్చారు.

గణతంత్ర దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాల పునర్విభజన తర్వత ఎర్పడిన గుంటూరు జిల్లాలో మొదటిసారిగా జరుగుతన్న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంపై జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు, అతిధులు, ఆహ్వానితులకు , విధ్యార్థులకు, ప్రజలకు వెర్వేరుగా సీటింగ్ ఎరెంజ్మెంట్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రశంసా పత్రాల అందించటం, ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాటు సంబంధిత అంశాలకు సంబంధించిన ఏర్పాట్లును బాధ్యతలు అప్పగించిన అధికారులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రభుత్వ శాఖలలో అమలు జరుగుతున్న పథకాలను ప్రతిబింబిచేలా మంచి కాన్సెప్ట్ తో శకటాలను రూపొందించాలని, పెరేడ్ గ్రౌండ్‌లో శకటాల ప్రదర్శన తరువాత ప్రజల సందర్శనార్థం నగరంలోని ప్రధాన రహదారులలో శకటాల ర్యాలీ నిర్వహించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. విధుల్లో అత్యంత ప్రతిభ కనపరుస్తున్న ఉద్యోగులను ప్రశంసా పత్రాలకు సిఫార్సుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ప్రశంసా ప్రతాలకు సిఫార్సు చేస్తున్న వారి పేర్లు అన్ని శాఖలు జనవరి 22 నాటికి కలెక్టరేట్‌కు అందించాలన్నారు. జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రాల్లో, మండల కేంద్రాలు, పోలీంగ్ కేంద్రాల స్థాయిలోను ఓటర్లతో ప్రత్యేక కార్యక్రమాలను ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నిర్వహించాలన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యా సంస్థలలో వివిధ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు కలిపి ర్యాలీ, సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖరావు, జెడ్పి సిఇఒ శ్రీనివాసరావు, , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

నేటి నుండి ఆధార్ అప్‌డేషన్ స్పెషల్ డ్రైవ్

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ సేవల ధరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించేలా జిల్లా స్థాయి, రెవెన్యూ డివిజన్, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ జి .రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు తీసుకొని 10 సంవత్సరాలు పూర్తి అయిన వారు అప్డేషన్ చేసుకోవటానికి జనవరి 19 నుంచి 24 వరకు జిల్లాలోని అన్ని సచివాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలు వద్ద ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళాపోలీస్, ఎఎన్ఎం ప్రతి వారం సందర్శించి, అక్కడి పరిస్థితులను ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి, సమస్యలు ఉంటే ప్రదానోపాధ్యాయులు దష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు నెలకు రెండుసార్లు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో సీపీవో శేషశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఎస్ఓ పద్మశ్రీ, హౌసింగ్ పీడీ సాయినాధ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను బుధవారం కలెక్టరేట్ అవరణలో కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రత నిబంధన లపై అవగాహన కోసం రూపొందించిన ప్లెక్సీలు, ప్రచార పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రచార రధాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 18 నుంచి 24వ తేది వరకూ జరుగుతున్న వారోత్సవాలలో రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేకఖర్‌రావు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఉప రవాణా కమిషనరు ఎస్.కే.కరీం, ఆర్అండ్‌బీ ఎస్ఈ లలితా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రహదారి భద్రతా వారోత్సవాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

త్రైమాసిక పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం త్రైమాసిక పన్నును భారీగా పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర టాటా ఏసి డ్రైవర్ యూనియన్ సమావేశం స్థానిక పాత గుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో యం.హరిపోతురాజు అధ్యక్షతన జరిగింది. కేంద్రం తీసుకున్న రవాణా రంగ వ్యతిరేక నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తుండటం వల్ల రాష్ట్రంలో రవాణా రంగంపై పెనాల్టీలు, గ్రీన్ టాక్స్, చలానా ఫీజులు, భారీగా అపరాధ రుసుముల ద్వారా వేల కోట్ల రూపాయలు భారం మోపిందన్నారు. అంతేకాక మూడు నెలల త్రైమాక్షక పన్నును 30శాతం దాకా పెంచటం వల్ల కిస్తీలు చెల్లించలేక వాహనాలు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రవాణా రంగంపై ఆధారపడిన డ్రైవర్లు, ఇతర వర్కర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి యం.హరిపోతురాజు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన మోటారు వాహన చట్ట సవరణ బిల్లును ఏరాష్ట్రం అమలు చేయకపోయినా, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. రవాణా రంగాన్ని ఆదుకుంటాను అని పాదయాత్రలో హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి రవాణా రంగంపై ముప్పేట దాడి చేస్తూ, ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 30శాతం పెరిగిన రోడ్ ట్యాక్స్ ధరలు అమలులోకి వస్తే లారీ ఓనర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, వాటిని నమ్ముకుని జీవిస్తున్న లారీ డ్రైవర్ల పరిస్థితి మరీ దీనంగా ఉంటుందన్నారు. కావున పన్ను పెంపుదల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బి.ముత్యాలరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ